అదే దుస్థితి

- జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో అసంపూర్తిగా నిర్మాణాలు
- రూ. కోట్ల ప్రజాధనం నిరర్థకం
- వైసీపీ హయాంలో ఐదేళ్లు నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలోనూ అదే పరిస్థితి

వ్యవసాయ మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల ద్వారా ఏటా రూ. కోట్లలో ఆదాయం వస్తుంది. మార్కెట్‌కు వచ్చే రైతులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో భారీ షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. వీటికి రూ. కోట్లు వెచ్చించారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ కాలంలో ఐదేళ్లు అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికే ఖర్చు చేసిన రూ. కోట్ల ప్రజా ధనం నిరర్థకంగా మారింది. సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కూడా ఈ పది నెలల్లో అదే పరిస్థితి కొనసాగుతున్నది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో అసంపూర్తిగా ఉన్న షెడ్లు, ఉల్లి శీతల గిడ్డంగుల తాజా పరిస్థితిపై ఆంధ్రజ్యోతి కథనం.



కర్నూలు మార్కెట్ యార్డులో రూ.2 కోట్లు ఖర్చు చేసి అసంపూర్తిగా వదిలేసిన ఉల్లి శీతల గిడ్డంగులు

కర్నూలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నా.. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులు రోజువారి (రెగ్యులర్)గా పత్తి, ఉల్లి, మిరప, వేరుశనగ, వాము, కంది.. వంటి పంట ఉత్పత్తులు క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. పత్తికొండ మార్కెట్ యార్డులో టమోటా సీజన్‌లో మాత్రమే టమోటా క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. ఆలూరు, మంత్రాలయం (కోసిగి), కోడుమూరు మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయాలు జరగడం లేదు. ఆయా మార్కెట్లలో ప్రతి ఏటా సరాసరి రూ.3,500 కోట్ల నుంచి రూ.4 వేల కోట్ల వరకు విలువైన పంట ఉత్పత్తులు రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఒక శాతం మార్కెట్ సెస్సు రూపంలో ఈ ఏడాది రూ.39 కోట్లు ఆదాయం సమకూరింది. మార్కెట్‌కు పంట దిగుబడులు తీసుకొచ్చే రైతులకు మౌలిక వసతులు, పంట దిగుబడులు వర్షాలు, ఎండలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కల్పించడం, గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేసుకోవడానికి గోదాముల సౌకర్యం కల్పించే బాధ్యత మార్కెటింగ్ శాఖపై ఉంది.

వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం



ఆదోని కాటన్ మార్కెట్ యార్డులో పిల్లర్ల దగ్గరే ఆగిపోయిన భారీ షెడ్డు నిర్మాణం


రైతులు తీసుకొచ్చే పంట దిగుబడులు నిల్వ చేసుకోవడం, వర్షాలకు తడవకుండా, ఎండలకు రక్షణ కల్పించాలనే లక్ష్యంగా 2018-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.14.50 కోట్లతో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో ఉల్లి శీతల గిడ్డంగులు, జంబో షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. దాదాపు రూ.6.30 కోట్లు వెచ్చించింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని కొనసాగించకుండా అసంపూర్తిగా వదిలేసింది. ఇప్పటి దాకా ఖర్చు చేసిన రూ. కోట్ల ప్రజాధనం మట్టిపాలేనా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అసంపూర్తిగా ఉల్లి శీతల గిడ్డంగులు

కర్నూలు మార్కెట్ యార్డుకు ఏటా రూ.750-850 కోట్లు విలువైన వ్యవసాయ పంట దిగుబడులు రైతులు మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ఏటా రూ.7.50-8.50 కోట్లు ఆదాయం వస్తే.. అందులో. ఒక్క ఉల్లి అమ్మకాల ద్వారానే రూ.1.50 కోట్లు వస్తుంది. రాయలసీమలో ఏకైక ఉల్లి మార్కెట్ ఇది. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలు, సరిహద్దున తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా నుంచి ఉల్లి దిగుబడులు తీసుకొస్తున్నారు. గిట్టుబాటు ధర లేక.. లారీ బాడుగులు కూడా గిట్టుబాటు కాక రైతులు ఉల్లిని రోడ్లపై పారబోసిన వెళ్లిపోయిన సందర్భాలు ఉన్నాయి. మద్దతు ధర లేనప్పుడు ఉల్లి నిల్వ చేసి.. మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడానికి వీలుగా గత టీటీపీ ప్రభుత్వం నాబారు నిధులు రూ.5 కోట్లతో ఉల్లి శీతల గిడ్డంగుల నిర్మాణం చేపట్టింది. రూ.2 కోట్లు ఖర్చు చేశారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పనులు కొనసాగించకపోగా ఎక్కడి పనులు అక్కడితో ఆపేయమని 2021-22లో ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం బ్యాలెన్స్ పనులకు కోసం రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం ఖజానాపై రూ.2 కోట్లు ఆదనపు భారం తప్పడం లేదు. కూటమి ప్రభుత్వమైన పూర్తి చేస్తుందా..? అన్నది ప్రశ్నార్థకమే.

భారీ షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యేనా..?

- కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ, వాము, కంది, పప్పు శనగ.. వంటి పంట దిగుబడులు క్రయ విక్రయాల కోసం మార్కెట్ ఆఫీసుకు ఎదురుగానే రూ.2.50 కోట్లతో జంబో షెడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. 80 శాతం పూర్తి చేసినా డ్రైన్లు, సిమెంట్ ప్లాస్టింగ్.. వంటి పనులు ఆసంపూర్తిగా ఉన్నాయి.
- రాయలసీమలోనే ఏకైక పత్తి మార్కెట్ ఆదోని. ఈ ఏడాది రూ.1,720 కోట్లకు పైగా విలువైన పత్తి, వేరుశనగ, వాము, కంది.. వంటి పంట దిగుబడులు రైతులు అమ్మకానికి తెచ్చారు. 6.50 లక్షల క్వింటాళ్లకు పైగా అమ్మకానికి వచ్చింది. అయితే.. పంట దిగుబడులు మార్కెట్ తెచ్చిన సమయంలో వర్షాలు రావడం, తడిసి పత్తి రంగు మారి నాణ్యత కోల్పోవడంతో ధరలు తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారు. పత్తి పంట వానకు తడవకుండా ఉండేందుకు గత టీడీపీ ప్రభుత్వం రూ.2 కోట్లతో జంబో షెడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సివిల్ పనులకు సుమారుగా రూ.80 లక్షలు ఖర్చు చేశారు. పైన ఇనుప రేకులు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. టీడీపీ ప్రభుత్వం పోయి వైసీపీ ప్రభుత్వం రావడం రైతులకు శాపంగా మారింది. ఆరేళ్లుగా పిల్లర్లతో అసంపూర్తిగా ఆగిపోయింది.
- ఎమ్మిగనూరు మార్కెట్‌లో వేరుశనగ, కంది, వాము, పప్పు శనగ.. వంటి పంట దిగుబడులు అమ్మకానికి రైతులు తెస్తున్నారు. ఈ ఏడాది రూ.8.40 కోట్లు సెస్సు రూపంలో ఆదాయం వచ్చింది. అంటే.. రూ.840 కోట్లు విలువైన పంట ఉత్పత్తులు క్రయవిక్రయాలు జరిగాయి. రైతు పంటలు వర్షాలకు తడవకుండా ఉండేందుకు రూ.2.50 కోట్లతో జంబో షెడ్డు నిర్మాణాలు చేపట్టారు. సీసీ ప్లాట్‌ఫారం, పిల్లర్లు వంటి పనులు చేసి దాదాపు రూ.1.50 కోట్లు ఖర్చు చేశారు. ఇనుప రేకులు ఏర్పాటు చేయాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా ఆగిపోయాయి.



కర్నూలు మార్కెట్‌లోని షెడ్డు

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

కర్నూలు మార్కెట్‌లో ఉల్లి శీతల గిడ్డంగులు సహా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మార్కెట్లలో షెడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్న మాట నిజమే. వీటిపై ప్రభుత్వానికి నివేదిక పంపించాం. పునఃనిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేశాం. మార్కెటింగ్ శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించారు. అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నిర్మాణాలు మొదలు పెడతాం.

\- నారాయణమూర్తి, ఏడీ, మార్కెటింగ్ శాఖ, కర్నూలు



ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పిల్లర్ల దగ్గర ఆగిపోయిన షెడ్డు నిర్మాణం

జిల్లాలో 333 వెట్ ల్యాండ్స్ గుర్తింపు

- సరిహద్దుల నివేదిక వారంలోపు సమర్పించాలి
- అధికారులకు కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశం



అధికారులతో సమావేశమైన కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్పేస్ అప్లికేషన్ సెంటర్ అట్లాస్ ప్రకారం జిల్లాలో 333 వెట్ ల్యాండ్స్ గుర్తింపు మేరకు భూముల సరిహద్దులతో పాటు గ్రౌండ్ ట్రూతింగ్ తదితర వివరాలతో వారంలోపు నివేదిక సమర్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా వెట్ ల్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెట్ ల్యాండ్ రూల్స్-2017 ప్రకారం జిల్లాలో వెట్‌ల్యాండ్ సంరక్షణ, నిర్వహణ కోసం జిల్లా వెట్‌ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నీరు నిల్వ ఉండే ప్రాంతాలు సహజంగా గానీ, కృత్రిమంగా గానీ, శాశ్వతంగా గానీ, తాత్కాలికంగా గానీ, స్థిరంగా గానీ, ప్రవహించే తాజా సముద్ర నీటి ప్రాంతాలతో సహా తక్కువ అలలతో, లోతు ఆరు మీటర్లు గల నీటి సముదాయాలను వెట్ ల్యాండ్ కింద పరిగణించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఎఫ్‌వో శ్యామల, ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

కనిష్ఠంగా శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

సున్నిపెంట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం కనిష్ఠ స్థాయి కంటే దిగువకు పడిపోయింది. దీనితో ఇరు రాష్ట్రాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడగులు కాగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి నీటిమట్టం 818 అడుగులకు చేరింది. నీటి సామర్థ్యం 215 టీఎంసీలకు గాను 39.90 టిఎంసీలుగా నమోదు అయింది. కేంద్ర ప్రభుత్వ జల వనరుల శాఖ ఆదేశాల మేరకు డ్యాం నీటి మట్టం 834 అడుగులకు తగ్గకుండా చూసుకోవాలి. కేంద్ర జల వనరుల శాఖ అదేశాలు బేఖాతరు చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో ప్రతి రోజు విద్యుత్ ఉత్పాదన జరుపుతున్నారు. దీనితో రిజర్వాయర్‌లో క్రమేపీ నీటి నిలువలు తగ్గుతున్నాయి. కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో డ్యామ్ నీటి మట్టం 797 అడుగు వరకు విద్యుత్ ఉత్పాదన చేసే అవకాశం ఉంది. కాని రిజర్వాయర్‌లో వంద్రు పేరుకు పోవడంతో కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనకు అనుకూలంగా లేదు. అయితే బుధవారం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన జరిగింది. దీనితో 410 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. ఇక కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 2400 క్యూసెక్కులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి కేవలం 245 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేశారు. వేసవి తాపానికి 358 క్యూసెక్కుల నీరు అవిరి అయ్యిందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో బుధవారం 0.177 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి జరిగినట్లు తెలంగాణ జెన్‌కో అధికారులు తెలిపారు.



శ్రీశైలం డ్యామ్

మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఆన్‌లైన్ ఉచిత కోచింగ్ ప్రోగ్రాం కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి కె. ప్రసూన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాకు చెందిన ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులు అని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగుతుల సంక్షేమ కార్యాలయంలో ఫారాలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు. అభ్యర్థులు టెట్‌లో అర్హత పొందిన పత్రం, రెండు ఫొటోలు, విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, నేటివిటీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతపరిచి కర్నూలులోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయానికి స్వయంగా వచ్చి దరఖాస్తును అందజేయాలని తెలిపారు. దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేది, ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభం తేది, కోచింగ్‌కు వ్యవధి కాలం వంటి వివరాలను త్వరలో అభ్యర్థులకు తెలియజేస్తామని తెలిపారు.

తేనె.. లాభాల పట్టు **6** చెరువులకు జీవకళ

ఆలమూరులో 40.35 డిగ్రీల ఉష్ణోగ్రత

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో రుద్రవరం మండలంలో అత్యధికం



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో 40.35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ నిపుణులు వెల్లడించారు. ఆ తర్వాత కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం వగరూరు గ్రామంలో 40.2, నంద్యాల జిల్లా బండిఆత్మకూరు మండలం ఈర్నపాడులో 39.98 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లాలో దొర్నిపాడు గ్రామంలో 39.77, పాణ్యం మండలం గోనవరంలో 39.7, చాగలమర్రి మండలం ముత్యాలపాడులో 39.49, శిరివెళ్లలో 39.44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే మహానంది మండలం గాజులపల్లె, బుక్కాపురం గ్రామాల్లో 39.37, వెల్దుర్తి మండలం కలుగొట్లలో 39.37, సంజామల మండలం లింగందిన్నె గ్రామంలో 39.29, బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం గ్రామంలో 39.11, బనగానపల్లె పాతపాడు గ్రామంలో 39.03, గోస్పాడు గ్రామంలో 39.02 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాలో కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో 39.59, కౌతాళం మండలం తోవి గ్రామంలో 39.04, కోసిగి మండలం సత్తనూరులో 39.09 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

రాబోయే ఐదు రోజుల్లో..

కర్నూలు జిల్లాలో రాబోయే ఐదురోజుల్లో పలుచోట్ల చిరు జల్లులు పడే అవకాశం ఉందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 డిగ్రీల సెల్సియస్ నుంచి 40.5 డిగ్రీల వరకు నమోదు కావచ్చని భారత వాతావరణ సంస్థ నిపుణులు వెల్లడించారు. అలాగే ఆగ్నేయం దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, గాలిలో తేమశాతం ఉదయం 54 నుంచి 66 శాతం, మధ్యాహ్నం పూట 16 నుంచి 20 శాతం నమోదయ్యే అవకాశముందని తెలిపారు.

నంద్యాల జిల్లాలో రాబోయే ఐదు రోజుల పాటు కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39.7 నుంచి 42.2 డిగ్రీలు నమోదు కావొచ్చని భారత వాతావరణ సంస్థ నిపుణులు తెలిపారు. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 9 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశముందని, గాలిలో తేమశాతం ఉదయం 65 నుంచి 74శాతం, మధ్యాహ్నం 17 నుంచి 20 శాతం నమోదు అయ్యే అవకాశముందని వెల్లడించారు.

పదో తరగతి మూల్యాంకనం పూర్తి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడులోని క్రైడో పాఠశాలలో ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం పూర్తయింది. కర్నూలు జిల్లాకు 1,92,725 జవాబు పత్రాలకు మూల్యాంకనం సకాలంలో పూర్తి చేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో మూల్యాంకనం నిర్వహించినట్లు తెలిపారు. ఓపెన్ ఇంటర్మీడియట్ 16,220 జవాబు పత్రాలు జిల్లాకు వచ్చాయని, ఆరు రోజుల్లో వందశాతం మూల్యాంకనం పూర్తి చేసినట్లు తెలిపారు. నిర్ణయించిన సమయంలో మూల్యాంకనం పూర్తి చేశామన్నారు. స్పాట్ వాల్యుయేషన్ పరీక్షల విభాగం అ సిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్, ఏసీవోలు ఓంకార్ యా ద వ్, మల్లికార్జున శెట్టి, దూల్‌సాహెబ్, భీమన్న, నజీర్ అహ్మద్, శివశంకర్ రెడ్డి, గిడ్డమ్మ, పార్థసారథి, విజయమ్మ వ్యవ హరించారని చెప్పారు. సమష్టిగా మూల్యాంకనం పూర్తి చేసేం దుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ డీఈవో కృతజ్ఞతలు తెలిపా రు.

ముగిసిన జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీన ప్రారంభమైన జేఈఈ-మెయిన్స్-2 ప్రవేశ పరీక్ష బుధవారం ముగిసింది. దేశంలో ప్రఖ్యాతి గాంచిన ఐఐటీ-ఎన్ఐటీ కళాశాలలో బీటెక్, బీఆర్క్, బీ-ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. కర్నూలు నగరంలోని సనత్‌నగర్‌లో అయాన్ డిజిటల్ సెంటర్‌లో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష జరిగింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

తేనె.. లాభాల పట్టు





తేనె తయారు చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న రైతు అన్వర్‌బాషా

- పెట్టుబడి స్వల్పం, దిగుబడి అధికం
- ఉపాధినిస్తున్న తేనె తయారీ
- ఏటా రూ.5 లక్షల ఆదాయం గడిస్తున్న అన్వర్‌బాషా

తేనె పలు రోగాలకు అద్భుతమైన ఔషధం. ఆయుర్వేద వైద్యంలో విరివిగా వినియోగిస్తారు. ఆహార పదార్థాల తయారీలోనూ వాడుతారు. చక్కెరకు ప్రత్యామ్నాయంగా వాడే తేనె వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం నాణ్యమైన తేనె మార్కెట్‌లో దొరకడం కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో తేనె తయారీ ఒక కుటీర పరిశ్రమలా రైతులను ఆదుకుంటోంది. దీనికి ఉదాహరణ.. రైతు అన్వర్‌బాషా.



అన్వర్‌బాషా

చాగలమర్రి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రికి చెందిన రైతు అన్వర్‌బాషా అందరు రైతుల్లా కాకుండా భిన్నంగా ఆలోచించి తేనెటీగల పరిశ్రమ నెలకొల్పి లాభాలు గడిస్తున్నాడు. 2019లో గుంటురులోని ఓ ప్రైవేటు కంపెనీ ద్వారా శిక్షణ పొందాడు. 2020లో 25 తేనెటీగల బాక్సులతో పరిశ్రమను ప్రారంభించారు. ఒక్కో బాక్సును రూ.7,500 చొప్పున ఏలూరులో కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి తెచ్చి చాగలమర్రి, మైదుకూరు సమీపంలోని కంసల వనిపెంట, ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసి తేనె సేకరిస్తున్నాడు. ఒక్కో బాక్సులో 10 ఫ్రేమ్‌లు ఏర్పాటు చేశాడు. ఒక్కో దాంట్లో 75 వేల నుంచి లక్ష వరకు తేనెటీగలు ఉంటాయి. అనువైన ప్రదేశాలు ఎంపిక చేసుకొని అక్కడి రైతు పొలాల్లో తేనెటీగల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ బాక్సులు ఏర్పాటు చేశాడు. పొద్దుతిరుగుడు, మినుము, జొన్న, పెసర, మొక్కజొన్న, మామిడి, సజ్జ, నేరేడు, సపోటా తదితర పంటలు అధికంగా ఉన్న ప్రదేశాలను ఎంపిక చేసుకొని ఒక నిర్దిష్ట ప్రదేశంలో సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. తేనెటీగ సుమారు 10 కిలోమీటర్ల మేర తిరిగి పొలాల్లో మొక్కల మీది నుంచి మకరందాన్ని సేకరించి సాయంత్రానికి తిరిగి బాక్సులోకి చేరుకుంటుంది. ప్రతి బాక్సులో రాణి తేనెటీగ ఒకటి ఉంటుంది. అది గుడ్లు పెట్టి, తేనెతుట్టెను ఏర్పాటు చేయడం ద్వార తేనె ఉత్పత్తి అవుతుంది. 35 నుంచి 45 రోజులకు ఒకసారి తేనెను సేకరిస్తారు.

కాల పరిమితి, విధి విధానం

సాధారణంగా 45 రోజులకు తేనె చేతికందుతుంది. ఈ 45 రోజుల పాటు నిత్యం కేంద్ర నిర్వాహకులు అన్వర్‌బాషాతో సహా ఉన్న నలుగురు వ్యక్తులు ప్రతి రోజు లేదా రోజుమార్చి రోజు పర్యవేక్షిస్తుంటారు. వైరస్ సోకకుండా బాక్సుల బయట వైపు నివారణ మందు చల్లుతారు. ఈ 45 రోజుల్లో పెద్ద వర్షం వస్తే నష్టం వాటిల్లినట్లే. నిత్యం బాక్సులను శుభ్రం చేసుకుంటూ పరిరక్షించాలి. బాక్సుకు సమస్య వస్తే దానిని తొలగించి కొత్త బాక్సును అమర్చాలి. ఒక్కో బాక్సులో సుమారు 40 వేల నుంచి 50 వేల వరకు తేనెటీగలు ఉంటాయి.



చాగలమర్రిలో తేనెటీగల కోసం ఏర్పాటు చేసిన బాక్సులు

కష్టిస్తే ఆదాయం అందినట్లే

ఈ ప్రక్రియ సక్రమంగా సాగితే ఒక్కో బాక్సు నుంచి సుమారు 4 నుంచి 5 కేజీల తేనె లభిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ తేనె విలువ రూ.400 నుంచి రూ.500 మధ్య ఉంది. మొత్తంగా ఈ కాల పరిమితి ముగిసే సరికి 750 కేజీల వరకు తేనెను సేకరించి హోల్‌సేల్ లేదా రిటైల్ మార్కెట్‌లకు విక్రయిస్తున్నారు. అంటే సుమారు 40 రోజుల్లో రూ.4 లక్షల వరకు చేతికి అందగా ఖర్చులు, శ్రమ రూ.2 లక్షలు మినహాయించిన రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుంది. నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాక కూడా ఆదాయం చేకూరుతుంది. తేనెటీగల పరిశ్రమలో పని చేసే కూలీలకు కిలోకు రూ.70 ప్రకారం కూలీ ఇవ్వాల్సి ఉంటుంది.

పెట్టుబడి రూ.7,500లు

తేనెటీగల బాక్సు, తేనెటీగల కొనుగోలుకు రూ.7,500 ఖర్చు చేస్తున్నారు. ప్రతిసారి తేనెను సేకరించేందుకు ప్రతి బాక్సుకు కూలీలకు మరో రూ.700 ఖర్చు చేస్తున్నారు. బాక్సు నుంచి 4 కిలోల తేనె సేకరిస్తున్నారు. 25 బాక్సులకు రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ.10 లక్షలు దిగుబడి వస్తుంది. ఖర్చులన్నీ పోను రైతుకు రూ.5 లక్షలు వస్తుంది. ఇలా 2020లో 25 బాక్సులతో ప్రారంభించి ప్రస్తుతం 140 బాక్సులతో పరిశ్రమను నడిపిస్తున్నారు. చాగలమర్రి గ్రామ సమీపంలోని హైవే రహదారి సమీపంలో బాక్సులను ఏర్పాటు చేసి కూలీలచే తేనెటీగల పరిశ్రమను నిర్వహిస్తూ తేనెను సేకరిస్తున్నారు.



తేనె తయారీకి ఉపయోగించే రాణి ఈగలు

ఆన్‌లైన్ వేదికగా అమ్మకాలు

అన్వర్‌బాషా వాట్సాప్, ఫెస్‌బుక్, ఇతర ఆన్‌లైన్ మాధ్యమాల ద్వార వినియోగదారులకు కిలో తేనే రూ.450 విక్రయిస్తున్నాడు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నవారికి కొరియర్ ద్వార సరఫరా చేస్తున్నాడు. చాగలమర్రి నుంచి కర్నూలు, కడప, నంద్యాల, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు తేనెను సరఫరా చేస్తూ లాభాలను గడిస్తున్నాడు.

పబ్లిసిటీ కోసమే జగన్ రాప్తాడు పర్యటన

- పోలీసుల బట్టలు ఊడతీస్తా అనడం ఏమిటి ?
- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్ రాప్తాడు పర్యటన కేవలం తన పబ్లిసిటీ కోసమేనని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి మాట్లాడుతూ భద్రత వైఫల్యం అంటూ పోలీసులపై జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం అన్నారు. పోలీసుల బట్టలు ఊడదీస్తానంటూ హెచ్చరించడం సరైన పద్ధతి కాదన్నారు. 11 ఏళ్లగా బెయిల్‌పై బయట తిరుగుతూ రాష్ట్రంలో ఆరాచకం సృష్టిస్తున్నారని అన్నారు. పోలీసులు ప్రొటోకాల్‌ను పాటిస్తే వారిపైకి వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదని అన్నారు. ప్రజల మధ్య తగువుపెట్టేందుకే జగన్ బయటకు వస్తున్నారని, ఆయన ఉచ్చులో పడ వద్దంటూ విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టుల నిర్వహణకు రూ. 3 కోట్ల ప్రతిపాదనలు

నంద్యాల మున్సిపాలిటీ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్వాహణకు రూ. 3 కోట్ల నిధుల ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపామని మంగళవారం జిల్లా ప్రాజెక్టుల వాటర్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పర్సన్, టీజీపీ ఎస్‌ఈ శివప్రసాద రెడ్డి తెలిపారు. జిల్లాల్లో ఎస్సార్బీసీ, టీజీపీ, కేసీ తదితర ప్రాజెక్టుల నిర్వాహణ కోసం జలవనరుల శాఖ ముఖ్య ఇంజనీర్ కబీర్ బాషాకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ ప్రతిపాదనలు సీఈ ప్రభుత్వానికి పంపారని, త్వరలో నిధులు విడుదల అవుతాయని పేర్కొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి తదితరులు

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించనున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ యువకుల కోసం నిర్వహించే ఈ మేళా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతుంది. టీడీపీ కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎంఈ గుర్రప్ప, కోఆర్డినేటర్ బాల వీరారెడ్డి పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పొదుపు మహిళా సంఘాలకు రుణాలు విరివిగా ఇవ్వాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని ఉద్యానభవన్‌లో ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పొదుపు మహిళా సంఘాలకు బ్యాంకు అధికారులు అత్యధిక రుణాలు మంజూరు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రామచంద్రరావు, అన్ని బ్యాంకుల మేనేజర్లు, జిల్లా, మండలస్థాయి సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జూన్‌లోగా పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేయాలి
- రీ సర్వేలో తప్పులు చేస్తే చర్యలు
- కలెక్టర్ రంజిత్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఉపాధి హామీ, తాగునీరు, రీసర్వే, గ్రామ, వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పీజీఆర్ఎస్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్ మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరు కాని గోనెగండ్ల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్ నెలలో ముమ్మరంగా ఉపాధి హామీ పనులను కల్పించి 90 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 8,500 పంట కుంటలు నిర్మించడం లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 5,661 నిర్మాణాలకు మంజూరు ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1268 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని, 437 పూర్తయ్యాయని అన్నారు. జూన్‌లోపు పంట కుంటల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ ట్రూతింగ్ పనులు పూర్తి చేసిన వెంటనే సర్టిఫికెట్ పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డ్వామా పీడీ వెంకటరమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే16న ఉచిత సామూహిక వివాహాలు

- అర్హులైన వధూవరులకు రూ.80 వేలు ఆర్థిక సాయం
- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మే నెల 16వ తేదీన వివాహాలు చేసుకునే జంటలకు రూ.80 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు రాజ్యసభ సభ్యుడు మాజీ టీజీ వెంకటేశ్ బుధవారం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అప్లికేషన్ల కోసం కర్నూలు నగరంలోని మౌర్యఇన్‌లోని కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. తన జన్మదినం సందర్భంగా గత 30 ఏళ్లగా సామూహిక వివాహాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. వివాహం చేసుకునే వధూవరుల్లో ఒకరు కర్నూలు నియోజకవర్గ పరిధిలో గానీ, పంచలింగాల, ఈ-తాండ్రపాడు, గొందిపర్ల, పూలతోట, దేవమాడ, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన వారై ఉండాలని తెలిపారు. అన్ని కులాల వారు, ముస్లిం, క్రైస్తవులు అర్హులని చెప్పారు. దరఖాస్తు చేసుకునే వారు తమకు ఎటువంటి దురలవాట్లు లేవని, భవిష్యత్తులో కూడా చెడు అలవాట్లకు బానిసలు కాబోమని డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. నూతన వధూవరులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేజర్లు అయి ఉండాలని, వారికి నగదు పారితోషికంతో పాటు తాళిబొట్టు, కాలి మెట్టలు, పట్టువస్త్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దాశెట్టి శ్రీనివాసులు, వాయుగండ్ల సుబ్బారావు, కే.రామస్వామి, శ్రీకాంత్, బాలయ్య, పాల్‌రాజ్, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీజీ వెంకటేశ్

18 మంది ఎస్‌ఐల బదిలీ



కర్నూలు క్రైం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :కర్నూలు రేంజ్ పరిధిలో 18 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్‌ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎం.పరమేష్ నాయక్	వీఆర్, కర్నూలు	సి.బెళగల్ పీఎస్
ఎం.తిమ్మారెడ్డి	సి.బెళగల్ పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
సి.శరత్ కుమార్ రెడ్డి	ముచ్చుమర్రి) పీఎస్ (నంద్యాల	నాగులాపురం పీఎస్
వీటీ ఆశాలత	నాగులాపురం పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
ఎస్.తిమ్మయ్య	గూడూరు పీఎస్	ఇస్వీ పీఎస్
ఎస్.నాగేంద్ర	ఇస్వీ పీఎస్	మహిళా పీఎస్, కర్నూలు
పి.నిరంజన్ రెడ్డి	పెద్దకడుబూరు పీఎస్	గూడూరు పీఎస్
పి.మధుసూదన్ రెడ్డి	సైబర్ సెల్	ఎమ్మిగనూరు టౌన్ పీఎస్
డీఆర్ నాయక్	ఎమ్మిగనూరు టౌన్ యూపీఎస్	పెద్దకడుబూరు పీఎస్
డీ.ఎర్రిస్వామి	వీఆర్, కర్నూలు	కోడుమూరు పీఎస్
ఏపీ శ్రీనివాసులు	కోడుమూరు పీఎస్	కర్నూలు టూటౌన్ యూపీఎస్
డి.కిరణ్‌బాబు	వీఆర్, కర్నూలు	మహిళా పీఎస్, కర్నూలు
బి.మల్లికార్జున	వీఆర్, కర్నూలు	కర్నూలు టూటౌన్ పీఎస్
ఎస్‌పీ మహబూబ్ బాషా	వీఆర్ కర్నూలు	పీసీఆర్, కర్నూలు
బీవీ రమణారావు	మహిళా పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.నిర్మలాదేవి	మహిళా పీఎస్	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
పి.మోహనకిషోర్ రెడ్డి	కర్నూలు టూటౌన్ పీఎస్	కర్నూలు ఫోర్త్ టౌన్ పీఎస్
సమీర్ బాషా	కర్నూలు ఫోర్త్ టౌన్ పీఎస్	ఆదోని వన్‌టౌన్ పీఎస్

చెరువులకు జీవకళ



- ఉపాధి హామీతో మారనున్న చెరువుల ముఖ చిత్రం
- పల్లె పుష్కరిణి పేరుతో భూగర్భ జలాల పెంపు
- ఉమ్మడి జిల్లాలో 60 చెరువుల అభివృద్ధికి ప్రణాళిక

కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలోని చెరువుల రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. శిథిలావస్థకు చేరి కనుమరుగైపోయిన చెరువులకు మళ్లీ జీవకళ రానుంది. వచ్చే నెల నుంచి మొదలయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నీటి వనరుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వర్షపు నీరు వృథా కాకుండా ఒడిసిపట్టి భూగర్భజలాలను పెంచేందుకు పల్లె పుష్కరిణి పేరుతో శిథిలావస్థకు చేరిన చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్లు చెరువులను పల్లె పుష్కరిణి కార్యక్రమం కింద ఎంపిక చేయడానికి విధి విధానాలను రూపొందించే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రతి మండలానికి ఒకటి నుంచి రెండు చొప్పున మొదటి విడతగా కర్నూలు జిల్లాలో 30, నంద్యాల జిల్లాలో 35 చెరువులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. రాయల కాలంలో ఈ చెరువులు గ్రామాలకు ప్రాణాధారంగా నిలిచాయి. తాగునీరు, సేద్యం కోసం పల్లెల్లో చెరువులు తొవ్వించారు. ఆ తర్వాత చెరువులు ప్రాధాన్యతను క్రమంగా కోల్పోయాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం నీరు-చెట్టు, పూడికతీత కార్యక్రమాలను చేపట్టి కొంత మేరకు చెరువులకు జవసత్వాలు కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు చేపట్టింది.

ఈ నెలలోపు ఎంపిక

పల్లె పుష్కరిణి పేరుతో చెరువుల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం ఈ నెల ఆఖరిలోపు శిథిలావస్థకు చేరిన పూర్తిగా కనుమరుగయ్యే దుస్థితిలో ఉన్న ఐదెకరాల్లోపు విస్తీర్ణంలో ఉన్న చెరువులను ఎంపిక చేయడంతో పాటు గ్రామ సభలో ఆమోదం తీసుకోవాలని ఉపాధి హామీ పథకం అమలు చేస్తున్న నీటి యాజమాన్య సంస్థ అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 30లోపు మొదటి విడతలో ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని దాదాపు 65 చెరువుల అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. వర్షాకాలంలో చెరువులో చేరిన నీటిని సంరక్షించాలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఉపాధి హామీ పథకంలోని మెటీరియల్ నిధులతో ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నారు. పూడి పోయిన చెరువులలో కూలీల చేత మట్టిని తీయించనున్నారు. ఒక్కో చెరువు అభివృద్ధికి రూ.5లక్షల దాకా ఖర్చు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. గ్రామాల్లో ఉన్న కోనేర్లు, ఊటబావుల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. వేయికి పైగా జనాభా కలిగిన గ్రామాల్లో రాష్ట్ర, జాతీయ రహదారులకు దగ్గరలో ఉన్న చెరువులను పల్లె పుష్కరిణిలో గుర్తించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. చెరువు విస్తీర్ణం ఎకరా నుంచి ఐదెకరాలు ఉండాలని, ఈ ఎంపిక చేసిన చెరువులను రాష్ట్ర, జిల్లా మండ స్థాయి అధికారులు దత్తత తీసుకుని అభివృద్ధి చేసేలా నీటి యాజమాన్య సంస్థ కృషి చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించింది.

చెరువులను గుర్తిస్తున్నాం

ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఐదెకరాల్లోపు విస్తీర్ణం కలిగిన చెరువులను గుర్తిస్తున్నాం. ఈ నెలాఖరుకు ఎన్ని చెరువులు అందుబాటులోకి వస్తాయో జాబితాను తయారు చేస్తాం. కర్నూలు జిల్లాలో 30 చెరువుల దాకా పల్లెపుష్కరిణి కింద ఎంపిక చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. గ్రామాల్లో వృథా నీటిని చెరువుల్లోకి మళ్లించి గ్రామ ప్రజల సాగు, తాగునీటి అవసరాలను గుర్తించడమే కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తాం.

- వెంకటరమణయ్య, డ్వామా పీడీ

లోకాయుక్తలో వైసీపీ నాయకుల ఫిర్యాదు

మహానంది, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరంలో అక్రమాలు జరుగుతున్నాయని బుధవారం కర్నూలు లోకాయుక్త, మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు పుల్లయ్య యాదవ్ తెలిపారు. గ్రామంలో కూటమి నాయకుల అండదండలతో భైరవాణి చెరువు నుంచి అక్రమ మట్టిని తరలిస్తున్నారని, అలాగే బెల్టుషాపుల నిర్వహిస్తున్నారని గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలపై పలుమార్లు గ్రామంలో వివాదాస్పదంగా మారాయని, దీంతో భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

వేసవిలో ప్రత్యేక రైలు

మద్దికెర, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో రద్దీ నియంత్రణకు గుంతకల్లు మీదుగా వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇప్పటి నుంచి ప్రతి శనివారం మే 10వ తేదీ వరకు హుబ్లీ, వారణాసికి రైలు నెం.07323 ఉంటుదన్నారు. తిరుగు ప్రయాణం రైలు ఈ నెల 8 నుంచి మే 13వ వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు హవేరీ, రాణి బెంగుళూరు, హరిహార్, దేవనగిరి, జిగ్‌జాగుర్, కడూర్, హర్సికెర, టోంకూరు, ఎల్లంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, కృష్ణా, బేగంపేట, సికింద్రాబాబు, ఖాజీపేట, జున్నుకుంట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలచంద్రాపూర్, నాగ్‌పూర్, ఆమ్లా, భేతూర్, హిటాచీ, జంబ్లపూర్, పాట్నా, మానిక్‌పూర్, ప్రయగరాజ్ చౌకీ, మీర్జాపూర్ స్టేషన్ మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే హుబ్లీ, ఖటీహార్ మీదుగా ప్రత్యేక రైలు.నెం.07325 ఈ నెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి బుధవారం ఉంటుదన్నారు. తిరుగు ప్రయాణం రైలు.నెం.07326ను ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకు ప్రతి శనివారం నడుపనున్నట్లు తెలిపారు. ఈ రైలు గదక్, కొప్పల్, హోస్పేట్, తోర్నగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్, నంద్యాల, దిగువమెట్ట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రాహ్మణపూర్, బోలాపూర్, శాంతినికేతన్ స్టేషన్ మీదుగా నడుస్తుందని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ఎల్లెల్సీలో తగ్గిన నీటిమట్టం



బాపురం వద్ద ఎల్ఎల్‌సీ

హాలహర్వి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర దిగువ కాలువలో నీటి మట్టం తగ్గిపోయింది. తాగునీటి అవసరాల కోసమే నిరు వదులుతున్నామని, అందేకు తగ్గించినట్లు తుంగభద్ర బోర్డు డీఈ హుసేన్ బాషా తెలిపారు. ఈనెల 15వరకు నీరు వదులుతామని, సాగునీటిని పూర్తిస్థాయిలో నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

తుగ్గలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో కూలి సురేంద్ర (32)మృతి చెందాడు. వివరాల మేరకు.. మృతుడు సురేంద్ర కాంట్రాక్టర్ వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం మండలంలోని దిగువచింతల కొండకు చెందిన రైతు పులిశేఖర్ పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు కాంట్రాక్టర్ కూలీలను తీసుకెళ్లి పనులు చేయించారు. పనులు చేస్తుండగా పందికోనకు చెందిన సురేంద్రకు తీగెలు తాకడంతో విద్యుదాఘాతానికి గరయ్యాడు. హుటాహుటిన పత్తికొండ వైద్యశాలకు తరలించగా.. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతునికి భార్య సువర్ణతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నారు. కాంట్రాక్టర్ ఎల్‌సీ తీసుకోకుండానే పనులు చేయడంతోనే ప్రమాదం సంభవించిందని విద్యుత్ అధికారులు తెలిపారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్, ఎస్ఐ క్రిష్ణమూర్తి, విద్యుత్ ఏఈ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులు, విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యులకు పరీక్ష



రోగిని స్ట్రెచర్‌పై తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్ట్రెచర్ బాయ్‌ల కొరత వేధిస్తోంది. సిబ్బంది లేకపోవడం, రోజురోజుకు సిబ్బంది సంఖ్య తగ్గుతోంది. దీంతో స్ట్రెచర్‌పై రోగిని బంధువులే తీసుకుని వచ్చి పరీక్షలకు వెళ్తుంటారు. కర్నూలు చెందిన సుబ్బమ్మ అనే రోగిని బంధువులు ఎఫ్ఎం-6 నుంచి కార్డియాలజీ వార్డుకు టూడీ ఎకో పరీక్షకు తీసుకువచ్చారు. ముగ్గురు బంధువులు స్ట్రెచర్‌పై ఎండలో తీసుకుని రావడం కష్టంగా ఉందంటున్నారు. అధికారులు స్ట్రెచర్ బాయ్‌లను నియమించాలని రోగులు కోరుతున్నారు.

27 నుంచి కూచిపూడి, భరతనాట్యంపై వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 27 నుంచి కూచిపూడి, భరతనాట్యంపై మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నటరాజ కళామందిర్ వ్యవస్థాపకుడు కరీముల్లా సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు. హైదరాబాద్ సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్ కూచిపూడి ఎ గురువు శ్రీపద్మ కల్యాణి, విజయవాడకు చెందిన భరతనాట్యం గురువు సంతోష్ పాల్గొంటారని తెలిపారు. రూ.500 చెల్లించి 15లోగా పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 7780475080, 9963628418 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


నూతన విధానంలో వృత్తి పన్ను వసూలు

● వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వృత్తి పన్ను వసూళ్లను పారదర్శకంగా చేసేందుకు ఏప్రిల్ 1 నుంచి నూతన విధానాన్ని తీసుకువస్తున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్, రిటర్న్ దాఖలు పన్నుల చెల్లింపుకు పొందుపరిచినట్లు ఆయన పేర్కొన్నారు. వృత్తి పన్ను చెల్లింపుదారులు నిబంధనల మేరకు పన్ను చెల్లించాలని, వార్షిక టర్నోవర్ రూ.10 లక్షల కంటే అదనంగా ఉన్న జీఎస్‌టీ చెల్లింపుదారులు వృత్తి పన్నులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు

రూ.50 వేలు విలువ చేసే మందులు సీజ్



మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూనెపల్లెకు చెందిన శ్రీవైష్ణవి మెడికల్ షాప్‌పై బుధవారం నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాడులు చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తుమందులు, యాంటీ బయాటిక్స్ విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, రూ.50 వేల విలువచేసే ఎన్ఆర్ఎక్స్ మందులను సీజ్ చేశారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దాదాఖలందర్ మాట్లాడుతూ సమాచారం మేరకు దాడులు చేశామని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుమందులు, యాంటీ బయాటిక్స్ అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడిలో వీఆర్వో సల్మాన్, జీజీహెచ్ ఫార్మసిస్టు లక్ష్మీనారాయణ, ఈగల్‌టీం సిబ్బంది పాల్గొన్నారు.

తియ్యటి మందు..





● హోమియోకు పెరుగుతున్న ఆదరణ
● దీర్ఘకాలిక రోగాలకు ప్రత్యామ్నాయ వైద్యం
● నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హోమియో గుళికలు తియ్యగా నోట్లో వేసుకుంటేనే కరిగిపోతాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు హోమియో వైద్యం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అలోపతి వైద్య విధానంలో సైడ్ ఎఫెక్ట్స్‌కు తాళలేక ప్రజల్లో హోమియో వాడకం ఎక్కువైంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో తప్ప ప్రత్యామ్నాయం కనిపించడం లేదు. ఖరీదు తక్కువగా ఉండటంతో ప్రజలు హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. జర్మనీ దేశానికి చెందిన శ్యామూల్ హానిమూన్ హోమియో వైద్య పితామహుడు. ఆయన తన నిరంతర పరిశోధన అనుభవంతో అనేక సత్ఫలితాలు సాధించారు. 208 సంవత్సరాల క్రితం హానిమూన్ కనుగొన్న మందులు ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయి. నేడు వరల్డ్ హోమియో డే సందర్భంగా ఆంధ్రజ్యోతి కథనం...

దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చింది. అలోపతి వైద్యం భారీ ఖర్చుతో కూడినదిగా మారడం వల్ల పేద, మధ్య తరగతి రోగులు హోమియో వైపు మొగ్గు చూపుతున్నారు. కర్నూలు నగరంలో 20 ఏళ్ల క్రితం కేవలం నలుగురు హోమియో వైద్యులు ఉండేవారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు హోమియో వైద్యులు 150 మంది సేవలు అందిస్తున్నారు. దాదాపు ఐదు రెట్లు హోమియో వైద్యులు పెరిగారు. కర్నూలు, నంద్యాలలో కూడా కార్పొరేట్ సంస్థలు కూడా హోమియో క్లీనిక్‌లను ప్రారంభించారు.

● ఉమ్మడి జిల్లాలో 21 డిస్పెన్సరీలు

ఉమ్మడి జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 21 డిస్పెన్సరీలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ హోమియో వైద్యులు 12 మంది ఉండగా.. ఎన్‌హెచ్ఎం కింద 9 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఇక కర్నూలు ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలో రోజు ఓపీకి 60 నుంచి 70 మంది చికిత్స కోసం వస్తుంటారు. గత పది సంవత్సరాలతో పోలిస్తే హోమియోకు 40 శతం రోగులు పెరిగాయి.

● దీర్ఘకాలిక ప్రయోజనాలు:

చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు, అలర్జీ, మానసిక ఆందోళన, సైనసైటిస్, కిడ్నీలో రాళ్లు, సయాటికా, పైల్స్, తలనొప్పి (మైగ్రీన్) ఆర్థరైటిస్, నరాల బలహీనత, టాన్సిల్స్, జీర్ణకోశ వ్యాధులు, సోరియాసిస్, ఊబకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో మందులతో మెరుగైన ఫలితాలు వస్తాయి. డెంగీ, మెదడువాపు, స్వైన్‌ఫ్లూ వంటి ప్రమాదకర వ్యాధులకు బాగా పని చేస్తాయి.

● వైద్య రంగంలో హోమియో విప్లవం



వైద్యరంగంలో హోమియో వైద్యం విప్లవం సృష్టిస్తుంది. జర్మనీకి చెందిన డా. హానిమన్ కన్న కల సంపూర్ణగా నెరవేరుతోంది. దీర్ఘకాలిక జబ్బులకు హోమియో మందులతో మెరుగైన చికిత్స అందించవచ్చు. జబ్బును ప్రాథమిక దశలో గుర్తించి హోమియో మందులు వాడితే త్వరగా నయమవుతుంది. ముఖ్యంగా జలుబు, స్కిన్ అలర్జీ, శ్వాసకోశ వ్యాధులకు హోమియోలో మంచి ఫలితం ఉంటుంది. ఉచిత హోమియో వైద్యాన్ని ప్రజలకు అందించడానికి ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా హోమియో డిస్పెన్సరీలను ఏర్పాటు చేసింది.

- డా.డి. మహాదేవరావు, సీనియర్ మెడికల్ ఆఫీసర్, కర్నూలు ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీ

● 39 ఏళ్లుగా ఉచిత సేవలు



కర్నూలులోని ధర్మపేటలో 1986 జూన్ 1 నుంచి దయల్బాగ్ రాధాస్వామి ఛారిటబుల్ హోమియో డిస్పెన్సరీ ద్వారా ప్రతి రోజు వంద మందికి సాయంత్రం 6 నుంచి 8 గంటలకు చికిత్స అందిస్తున్నాను. సీజనల్ వ్యాధులు, వడదెబ్బ, డెంగ్యూ జ్వరాలు, పిల్లల్లో జ్ఞాపకశక్తి పెంచడం, చికెన్‌పాక్స్ వంటి వ్యాధులకు ఉచిత హోమియో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నాం. ప్రతి బుధవారం కర్నూలు ధర్మపేటలో పేదల ఇల్లిల్లూ తిరిగి ఉచితంగా హోమియో మందులు ఇస్తున్నా.

- డా. కె. భాస్కర్ రెడ్డి, హోమియో వైద్యుడు, దయాల్బాగ్ రాధాస్వామి చారిటబుల్ హోమియో డిస్పెన్సరీ

● హోమియోతో మంచి ఫలితాలు



సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, దీర్ఘకాలిక మొండి వ్యాధులను హోమియో వైద్యంతో నయం చేయవచ్చు. ఇటీవల కాలంలో హోమియో వైద్యానికి ఆదరణ బాగా పెరిగింది. అల్లోపతి వైద్యంతో విసిగిన రోగులు ప్రత్యామ్నాయంగా హోమియో వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారు. సోరియాసిస్, ఆస్తమా, అలర్జీ, థైరాయిడ్, షుగర్, బీపీ, సీవోపీడీ, కిడ్నీ రాళ్లు, హార్మోన్ల సమస్య, స్పాండిలైటిస్‌కు మెరుగైన చికిత్స పొందవచ్చు.

- డా. శిరీషారెడ్డి, లైఫ్ హోమియోపతి, కర్నూలు

నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవు

● మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి



మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

మంత్రాలయం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మంత్రాలయం, మాధవరం ఏపీ మోడల్ స్కూల్, చిలకలడోన కేజీబీవీ, మాధవరం, రచ్చుమర్రి, మంత్రాలయం అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే బోజనంలో ప్రమాణాలు పాటించకపోవడం, రికార్డులను సక్రమంగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. మోడల్ స్కూల్‌లో ఆరుబయట వంట చేస్తున్నట్లు గుర్తించారు. అలాగే కాలంచెల్లిన రాగిపిండి, బెల్లంను స్వాదీనం చేసుకున్నారు. పరిమాణం తక్కువగా ఉన్న గుడ్లను తూకం వేసి వీటిని ఏజెన్సీకి వెంటనే అప్పగించి, మార్చాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. కోట్లలో ఖర్చు చేస్తున్నా పాఠశాలలో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో వడ్డించిన సాంబారులో కంది పప్పు తక్కువగా ఉండటంతో వంట ఏజెన్సీకి నోటీసులు జారీ చేయాలని ఎంఈవో షైనుద్దీన్, రాగన్న, హెచ్ఎం అంపయ్యను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు సంతృప్తికరంగా పని చేస్తున్నాయని అన్నారు. అద్దె భవనాల్లో నడుస్తున్న వాటిలో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అద్దెలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తున్నామన్నారు. అనంతరం బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసి పిల్లలకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని ఆదేశించారు. తనిఖీలో డీఎస్‌వో రఘువీర్, ఐసీడీఎస్ పీడీ నిర్మల, సీడీపీవో నరసమ్మ, తహసీల్దార్ ఎస్.రవి, సివిల్ సప్లయ్ డీటీ లు మహేష్, వలిబాషా, వీఆర్వోలు భీమన్నగౌడు, హెచ్ఎంలు అంపయ్య, భోజరాజు, ప్రిన్సిపాల్స్ శాంతి, ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగలక్ష్మి, టీచర్లు లావణ్యలత, తులసమ్మ పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారుల తల్లిదండ్రులు సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో ఇటీవల ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ డీఎస్పీ కార్యాలయంలో ఇద్దరు నిందితుల అరెస్టును చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల మండలం గోవింపల్లె గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి, సంజామల మండలం పెరుసోముల గ్రామానికి చెందిన సందెపోగుల పక్కీరయ్యతోపాటు మరో ముగ్గురు ఇందూరి ప్రతాప్‌రెడ్డిపై కత్తితో దాడి చేశారన్నారు. ఈ కేసులో రవీంద్రారెడ్డి, పక్కీరయ్యలను గోవిందపల్లె గ్రామ శివారులో నంద్యాల-కడప హైవే రోడ్డులోని కానాలపల్లి మెట్ట వద్ద అరెస్టు చేశామన్నారు. 2017 సంవత్సరంలో అదె గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డి అన్న ఇందూరు ప్రభాకర్‌రెడ్డి హత్య కేసులో రవీంద్రారెడ్డి కూడా నిందితుడిఇ అన్నారు. పాత కక్షల కారణంగా దాడి చేశారని భావిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కేసులో సహకరించిన మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. కేసులో చురుకుగా వ్యవహరించిన ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్సై చిన్నపీరయ్యలను ఆయన ప్రశంసా పత్రాలతో అభినందించారు.

బంగారు ఆభరణాల చోరీ

ఆదోని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండులో ఈనెల 6న ఓ మహిళ బ్యాగులో నుంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పట్టణంలోని కిల్చిన్ పేటకు చెందిన సునీత బళ్లారి వెళ్లేందుకు తిమ్మారెడ్డి బస్టాండుకు ఈనెల ఆరో తేదీన చేరుకుంది. ఆమె బ్యాగ్‌లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. బాధిత మహిళ ఊరికి వెళ్లి వచ్చాక బుధవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

రైల్వే ప్లాట్ ఫారంపై మృతదేహం

డోన్ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఓ వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ బిందుమాధవి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని జంగాల కాలనీలో వ్యాపారం చేసుకుంటూ నివాసముంటున్న తూర్పాటి వెంకటేశ్వర్లు (49) రైల్వే ప్లాట్‌ఫాంపై మృతి చెందాడని తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్లీనరీకి హాజరైన కాంగ్రెస్ నాయకులు



ప్లీనరీలో కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీకి ఆ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీ నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగ మధు యాదవ్, సయ్యద్ నవీద్ ముర్షిద్ ఖాద్రీ, సయ్యద్ నవీద్ హాజరయ్యారు.

కోడుమూరు ఘటనపై విచారణ

• కలెక్టర్‌కు నివేదిక ఇస్తా : ఆర్డీవో



హైమావతిని విచారిస్తున్న ఆర్డీవో సందీప్‌కుమార్

కోడుమూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పొలం సమస్యను పరిష్కరించాలని కోరిన హైమావతి పట్ల వీర్వోలు అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు రూ.లక్ష వసూలు చేసినట్లు వార్తలు అధికారులు స్పందించారు. బుధవారం కర్నూలు ఆర్డీవో కె.సందీప్‌కుమార్ బుధవారం కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేశారు. బాధిత మహిళను కార్యాలయానికి పిలిపించి, పొలం సమస్యపై విచారణ చేశారు. హైమావతికి అనుకూలంగా వచ్చిన కోర్టు తీర్పును క్షణ్ణంగా పరిశీలించారు. బాధితురాలు మాట్లాడుతూ తహసీల్దార్, వీఆర్వోలు తన నుంచి సుమారు రూ.లక్ష వసూలు చేశారన్నారు. పొలాన్ని ఆన్‌లైన్ చేయాలంటే మా కోరిక తీర్చాలని వీఆర్వోలు నారాయణ, పరమేష్, వెంకటరాముడు తనను మానసికంగా, శారీరకంగా వేధించినట్లు బాధితురాలు తన ఆవేదనను వెళ్లగక్కింది. మంగళవారం జరిగిన ఘటన అనంతరం నీ పొలం నీకు కాకుండా చేస్తామని ముగ్గురు వీఆర్వోలు తనను బెదిరించారని ఆవేదన వ్యక్తం చేసింది. వీఆర్వోల నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆర్డీవోకు మొరపెట్టుకొంది. ఆర్డీవో మాట్లాడుతూ ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశావా అని ప్రశ్నించారు. తాను పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని హైమావతి సమాధానం చెప్పింది.

కలెక్టర్‌కు నివేదిస్తాను

బాధితురాలు చెప్పిన విషయాలన్ని కలెక్టర్‌కు నివేదిస్తా. కోర్టు తీర్పు హైమావతికి అనుకూలంగా ఉండటంతో మరోసారి రికార్డులను పరిశీలించి బాధితురాలికి న్యాయం చేస్తాం.

- సందీప్‌కుమార్, ఆర్డీవో, కర్నూలు

వేసవి తాపానికి ఉపశమనం

● పుచ్చకాయలు, తాటిముంజలకు డిమాండ్
● నగరంలో జోరందుకుంటున్న అమ్మకాలు

కల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి. ఫిబ్రవరి, మార్చి నుంచే ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు తాటి ముంజలు, పుచ్చకాయలు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్యులు సూచిస్తున్నారు. పుచ్చకాయతో శరీరంలోని వేడిని తగ్గించుకోవడంతోపాటు చలువ చేస్తుంది. ప్రసుతం ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో.. నగర వాసులు పుచ్చకాయల కొనుగోలుకు ఉత్సాహం చూపిస్తున్నారు. మార్కెట్‌లో కిలో పుచ్చకాయ రూ.25 నుంచి రూ.30వరకు పలుకుతుంది.

● **పుచ్చకాయలతో ప్రయోజనాలు:** పుచ్చకాయలు తినడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. మలబద్దకం తగ్గు తుంది. రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. పుచ్చకాయలో విటమిన్-బి, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు, పుష్క లంగా ఉంటాయి. వేసవి తాపం నుంచి ఉపశ మనంతో పాటు తక్షణ శక్తిని అందిస్తుంది. అర్కలైన్‌తో పాటు పీచు పదార్థం ఉండటం వల్ల మూత్ర పిండాలకు ఎంతగానో ఉపయో గపడుతుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6శాతం చక్కెర, 90 క్యాలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల మాంసకృత్తులు, 12 గ్రాముల పోటాషియం, 7 గ్రాముల కాల్షియం ఉంటాయి.

● **వేసవి తాపం తగ్గించే ముంజలు:** తాటిముంజలు వేసవి తాపాన్ని తగ్గిస్తాయి. నగరంలోని ప్రధాన సెంటర్లలో వ్యాపారులు తాటిముంజలు విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో డజను (12 లేదా 15 తాటిముంజులు) రూ.100 విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఎక్కువ శాతం కుటుంబాలు తాటిముంజల వ్యాపారంతో జీవనం సాగిస్తు న్నారు. వేసవిలో ఎన్ని నీళ్లుతాగినా అలసిపోయేవారు. తాటిముంజలు తినడం వల్ల చలాకీగా ఉంటారు. తాటిముంజల్లో ఏ, బీ, సీ విటమిన్లతో పాటు జింక్, పోటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.



నగరంలో విక్రయానికి వచ్చిన తాటిముంజలు, పుచ్చకాయలు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

గూడూరు ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం గుడిపాడు గ్రామంలో వెలసిన అప్పాలరెడ్డి తాత తిరునాళ్ల పురస్కరించుకోని నిర్వహించిన బండలాగుడు పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించేందుకు బండలాగుడు పోటీ లను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు దాత జిల్లా సీనియర్ టీడీపీ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి, రెండో బహుమతి రూ. 30వేలు దాత కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మూడో బహుమతి రూ.20వేలు దాత ఆది కేశవ రెడ్డి, నాలుగో బహుమతి రూ. 10వేలు దాత తెలుగు సంఘం, ఐదో బహుమతి రూ. 5వేలు దాత కరెంటు పెద్దయ్య అందజేస్తారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె మహే శ్వర రెడ్డి, ఆర్ చంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వంశీకృష్ణరెడ్డి, ఆర్ రాఘవ రెడ్డి, ఆది కేశవరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారామే ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం స్థానిక మాధవీ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గౌరు చరిత మాట్లాడుతూ అర్జీలను సం బంధిత శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని సూచిం చారు. కార్యక్రమంలో ప్రజలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి: నగరంలోని బి.క్యాంపు మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు కోరారు. బుధవారం ఎమ్మెల్యే గౌరు చరితకు వినతిపత్రం అందజేశారు. సదరు పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు 371 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, క్లస్టర్ విభజన పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ పాఠశాలను డిగ్రేడ్ చేయడానికి విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భూ పోరాట యోధుడు, సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావుకు 31వ వర్థంతిని పురస్కరించుకుని బుధవారం సీపీఐ రాష్ట్ర కార్య వర్గసభ్యుడు లెనిన్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్పలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ ధనిక కుటుంబంలో పుట్టి పార్టీ, పేద ప్రజల కోసం సర్వస్వం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి రాజేశ్వరరావు అని కొనియాడారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి నల్లన్న, బీసన్న, నాగరాజు, కుమార్, అన్వర్ పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రి తనిఖీ


అల్ట్రా సౌండ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి పి.శాంతికళ బుధవారం కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ 3.0 స్కినింగ్ జరుగుతుందని, 18 ఏళ్లు దాటిన వారందరికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, ఏఎన్ఎం, పట్టణ ప్రాంతంలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎం, ఆశాలు ఇంటింటి సర్వే చేస్తున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు. అనుమానిత కేసులను కర్నూలు స్టేట్ క్యాన్సర్ నివారణ విభాగానికి ఓపీ నెంబరు.222కు రెఫర్ చేస్తామన్నారు. అనంతరం స్టేట్ క్యాన్సర్ సెంటరులో కొత్తగా వచ్చిన అల్ట్రాసౌండ్ మిషన్ గదిని పరిశీలిం చారు. స్కానింగ్ మిషన్‌కు సంబంధించిన పత్రాలు, వైద్యుల సర్టిఫికెట్లను తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో వెంట క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రకాష్, రేడియాలజిస్టు దిలీప్ కుమార్, డెమో శ్రీనివాసులు శెట్టి, ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై అవగాహన అవసరమని రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ కుమార్, వెంకట కృష్ణుడు, శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణరెడ్డి, కో-ఆర్డినేటర్ పి.నాగరాజు, కేవీ రత్నం, నాగచంద్రుడు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను తగ్గించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జీఎస్టీ పేరుతో ప్రజల జేబులు గుల్ల చేస్తుందన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ధర తగ్గుతుంటే మన దేశంలో పెంచడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి ఎదుట ఏఐవైఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కర్నూలులో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అనుమతి లేకుండా వైద్యం చేస్తూ ప్రజలను మోసగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, బీసన్న, అఖిల్, శివ, మద్దిలేటి, కాశీం పాల్గొన్నారు.

జీవనోపాధులను మెరుగు పరుచుకోవాలి

కల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాల సభ్యులు జీవనోపాధులను మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి సూచించారు. బుధవారం చిన్నటేకూరులో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పొదుపు సంఘాల సభ్యులు వారి జీవనోపాధుల కోసం ఆర్థికంగా ఎదిగేలా అవసరం అనేదానిపై సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పుష్పావతి, ఏపీఎం సీసీ రాముడు, శారద, శ్రీదేవి, డీఆర్‌డీఏ సిబ్బంది, సీసీలు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లకు మూడు ప్రత్యేక కౌంటర్లు

● ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ ఈనెల 30 వరకే..
● కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ , ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో పన్నుదారుల సౌలభ్యం కోసం ఆస్తి, తాగునీటి కొళాయి పన్నులను చెల్లించేందుకు వివిధ ప్రాంతాల్లో మూడు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాట చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ఏక మొత్తం చెల్లింపులపై 5 శాతం రాయితీ వర్తిస్తున్నందున కార్యా లయంలో పన్నుదారుల రద్దీ పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ కార్యాలయంతోపాటు కల్లూరులోని 85వ వార్డు సచివాలయం, జేఎన్‌ఆర్ నగర్ (రైతు బజార్ సమీపంలో) 62వ సచివాలయం, బాలాజీ నగర్‌లోని 104వ సచివాలయం ప్రత్యేక కౌం టర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయం త్రం 5 గంటల వరకు పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. స్థానిక సచివాలయాల్లో, ఆన్ లైన్, మీసేవా కేంద్రాలు, పుర మిత్ర యాప్, వాట్సాప్ నెంబర్ 9552300009ల ద్వారా కూడా పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

పంట కుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పంట కుంటల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఏపీవో రామన్న ఉపాధి సిబ్బందికి సూచిం చారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈసీ రంగ స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏపీవో మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతకు ఆధార్ నంబరు లింక్ చేసుకోవాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గోడౌన్ తనిఖీ


గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

గూడూరు ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గూడూరులోని పౌర సరఫరాల గోడౌన్‌ను కర్నూలు ఆర్డీవో కె.సందీప్ కుమార్ బుధవారం తనిఖీ చేశారు. గోడౌన్‌లో బియ్యం, బ్యాళ్లు, ఆయిల్, రాగులు వంటి సరుకుల స్టాక్ ఎంత ఉంది, ఎంత లిఫ్ట్ చేశారు అనే దానిపై ఆరా తీశారు. అనంతరం స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రామాంజనేయులు, సివిల్ సప్లయిస్ డిటి నవీన్, గోడౌన్ ఇన్‌చార్జి నస్రీన్, వీఆర్వో మధుకృష్ణ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాల, గుమితం తండా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని మెట్టభూముల్లో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోట లను పెంచుకోవాలన్నారు. అలాగే మినీ గోకులాల షెడ్లను, నీటి కుం టలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు మినీ గోకులం షెడ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో మద్దేశ్వరమ్మ, ఈసీ మధుశేఖర్ పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలల్లో అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ కుమార్ ప్రశ్నించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీలో జిల్లా కార్యదర్శి ఎస్ నాగార్జున ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలల్లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఎక్కడా కూడా బ్లాక్ టీచింగ్ క్లాసులు జరగడం లేదని, కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియమించుకోకుండా, సొంత భవనాలు నిబంధనల ప్రకారం లేకపోయినా ఎలా అడ్మిషన్లకు అవకాశం కల్పి స్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఈశ్వర్, యశ్వంత్, పవన్, సునీల్, కుమార్ పాల్గొన్నారు.

నదుల ఆక్రమణను నివారించాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలో నదులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆనంద్ థియేటర్, కేఈ మాదన్న నగర్ పక్కన హంద్రీ నదిపై అక్రమంగా నిర్మిస్తున్న పార్కును సీపీఎం నాయకులు పరిశీలించారు. ఆనంద్ బాబు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో నదులు, వాగులు, వం కలు, కాలువలు మురికి కూపాలుగా మారకుండా వాటిని శుభ్రపరచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. నదిని పూడ్చి పార్కు నిర్మించ డానికి జలవనరుల శాఖ అనుమతి ఎలా ఇచ్చిందని ఆయన ప్రశ్నించారు. అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి కాంట్రాక్టర్ల కడుపు నింపడానికే ఇలాంటి పనులు చేస్తున్నారని అన్నారు. నాగరాజు, అబ్దుల్లా, రంగప్ప, అమర్, మధు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర

సి.బెళగల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి గ్రామంలో మారెమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతలకు గ్రామస్థులు పూజలు చేశారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి బందోబస్తు నిర్వహించారు.

ఓటర్ల సమస్యలను పరిష్కరిస్తాం: ఆర్వో

కర్నూలు న్యూసిటీ , ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమస్యలను పరిష్కరిస్తామని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. గత నెలలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పురోగతిని సమావేశంలో ఆర్వో వివరించారు. వెంకటరమణ ఓటర్లు కిడ్స్ వరల్డ్ సమీపంలోని పోలింగ్ బూత్‌లో ఉన్నట్లు, ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేదంటూ గత నెల సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించారని ఆర్వో చెప్పారు. దీనిపై తగు చర్యలు చేపట్టామని, జోహరాపురం ఇందిరమ్మ కాలనీలో 969 మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సమయంలో వారి కోసం అక్కడ ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. వెంకటరమణ కాలనీ ఓటర్లకు పోలింగ్ కేంద్రం మార్పునకు దర ఖాస్తు ఇచ్చామని, తద్వారా వారికి సమీప పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తామని ఆర్వో తెలిపారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ ఆర్వో వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎమ్మార్వో ధనుంజ య, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్వో రవీంద్రబాబు

ఆక్సిజన్ పైపులైన్ పునరుద్ధరణ


పునరుద్ధరించిన ఆక్సిజన్ పైపులైన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద ఆదివారం రాత్రి చెట్టు విరిగి ఆక్సిజన్ పైపులైన్ మీద పడటంతో ఆక్సిజన్ లీకైన విషయం తెలిసిందే. ఆదివారం ఘటన జరిగితే మూడు రోజులకు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు లీకేజీ అవుతున్న ఆక్సిజన్ పైపులైన్‌కు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. దీంతో గత 3 రోజులుగా బల్క్ సిలిండర్లతో ఆక్సిజన్ తీసుకుంటున్న కాలినవార్డు రోగులకు బుధవారం మధ్యాహ్నం సెంట్రల్ ఆక్సిజన్ లభించడంతో రోగులకు ఊరట లభించింది. దీంతో కాలిన రోగుల వార్డులో బల్క్ సిలిండర్లను తొలగించారు. ఆక్సిజన్ పైపులైన్ లీకేజీని మూడురోజుల పాటు నిర్వహించడంపై రోగులు మండిపడుతున్నారు.

17న ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్‌పై విచారణ

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్‌పై జిల్లా యూత్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గత సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. శ్రీశైలం స్పెషల్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈ నెల 17న సంబంధిత రికార్డులతో ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ విచారణకు హాజరు కావాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

25 నుంచి టీజీవీ కళాక్షేత్రంలో వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 25వ తేదీ నుంచి మే 28 వరకు 'వేసవి శిక్షణ శిబిరం-2025' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శిబిరం కన్వీనర్ ఎస్ కరీముల్లా తెలిపారు. ఈ శిబిరంలో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యం, ఆధునిక నృత్యం, శాస్త్రీయ సంగీతం, చిత్రలేఖనం, మహిళలకు కోలాటం, పద్య నాటకాలు నేర్పిస్తారని తెలిపారు. వివరాలకు 7780475080, 9963628418 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి రఘునాథ్‌బాబు పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాణెమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

కల్లూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు మెరుగైన వైద్యం అందిచాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు వైద్యులకు ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు పొందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం ఆవశ్యకత, తల్లీబిడ్డల ఆరోగ్యంపై, ప్రజలకు మలేరియా, డెంగీపై అవగా హన కల్పించారు. కార్యక్ర మంలో డాక్టర్ ఆనందరావు, విజయ్‌కుమార్, స్వర్ణగౌరీ, నాగరాజు పాల్గొన్నారు.

● ఉలిందకొండ ఆరోగ్య కేంద్రాన్ని సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు బుధవారం సందర్శించారు. పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉలిందకొండ ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు.

'తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోం'

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆదోని ఎమ్మెల్యే పార్థసారధిపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని బీజేపీ అధికార ప్రతినిధి పీటీ సాయిప్రదీప్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం అన్ని వ్యవస్థలను గాడిలో పెడతుందన్నారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారధిపై తప్పుడు ప్రచారాలను మాజీ ప్రజా ప్రతినిధులు మానుకోవాలని హితవు పలికారు.

వైభవంగా కిస్తీలు

ఓర్వకల్లు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు గ్రామ సమీపంలో వెలసిన హజరత్ అల్లాబకాష్ మియా ఉరుసు సందర్భంగా బుధవారం కిస్తీలు వైభవంగా జరుపుకున్నారు. వీటిని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారికి కాయకర్పూ రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రసాదం కోసం భక్తులు ఎగబడ్డారు. ఎద్దుల బండ్లపై ప్రసాదాన్ని తీసుకెళ్లి దర్గా ఎదురుగా పంపిణీ చేశారు పూజారి ముజావర్ ఎంఎండీ మహబూబ్‌బాషా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

12న హనుమాన్ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి తెలిపారు. బుధవారం నగరంలోని కేసీ కెనాల్ వద్దగల వినాయక మందిరం సమావేశ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శోభాయాత్ర వివరాలు తెలియజేశారు. వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. 12న సాయంత్రం 4.30 గంటలకు పాతన గరంలోని జమ్మిచెట్టు వద్ద గల లలితా పీఠం నుంచి ఈ శోభాయాత్ర వన్‌టౌన్, పెద్దమార్కెట్, కొండారెడ్డి బురుజు, రాజ్‌విహార్ మీదుగా బుధవారంపేటలోని ఓం శ్రీసాయి సాతారామాంజనేయ స్వామి దేవాలయం వద్ద ముగుస్తుందని తెలిపారు. సమావేశంలో వీహెచ్‌పీ రాష్ట్ర జిల్లా నాయకులు అమరసింహారెడ్డి, ప్రతాపరెడ్డి, ఈపూరి నాగరాజు, నీలి నరసింహ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయండి

వెల్దుర్తి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని సీపీఐ కార్యదర్శి కృష్ణ బుధవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వ తప్పిదంతో ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తు చేసేందుకు ఆన్‌లైన్‌లో చూపించడం లేదన్నారు. వలంటీర్లు చేసిన పనివల్ల కలెక్టర్ ద్వారా రుజువు చేసుకోవాల్సి వస్తోందని న్యాయం చేయాలని కోరారు.

సాగు, తాగునీరు ఇవ్వడమే ధ్యేయం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీరు అందించడమే రాష్ట ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు అన్నారు. బుధవారం గుడిసె గుప్పరాళ్ల గ్రామంలో సోమశేఖర్ గౌడ్ నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పత్తికొండ ప్రాంతం వెనుకబడిన ప్రాంతమని, వర్షాధర పంటలు మాత్రమే పండుతాయన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి హంద్రీనీవా నీటితో చెరువులను అభివృద్ధి చేసి, నింపుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చెరువుల అభివృద్ధి పేరుతో నిధులు నొక్కేశారని ఆరోపించారు. జలవనరుల మంత్రి నిమ్మల రామనాయుడుకు విన్నవించారు. జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, శ్రీనివాసులు గౌడ్, వెంకట్రాముడు గౌడ్, మోహన్, చక్రపాణి, సుధాకర్‌గౌడు, హనుమంతుగౌడు, సీపీఐ కార్యదర్శి సుల్తాన్ పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి


ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

మద్దికెర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ పద్మావతి, కార్యదర్శి హరికృష్ణ సూచించారు. బుధవారం బురుజుల గ్రామంలో పంచాయతీ తరఫున ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. గ్రామంలో ఫ్లోరైడ్ నీరు ఉండటంతో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు.

జగన్ శవ రాజకీయాలు తగవు

మద్దికెర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శవరాజకీయాలు చేయడం తగదని టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, మాజీ జడ్పీటీసీ రాజన్న యాదవ్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు మూలింటి రామూ యాదవ్ అన్నారు. బుధవారం వేరువేరుగా విలేకరులతో మాట్లాడుతూ పోలీసులపై దురుసుగా మాట్లాడడం అన్యాయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్యాయాలు, అక్రమాలు జగన్‌కు కనపడలేదా అని ప్రశ్నించారు. ఓట్ల కోసమే అనంతపురం జిల్లాలో జగన్ రెడ్డి పర్యటించారన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, మొన్న ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినా ఇంకా మారలేదన్నారు. గడ్డం రామాంజులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం హెల్ప్‌లైన్

మద్దికెర, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంటే హెల్ప్‌లైన్ 8520796952కు ఫోన్ చేయాలని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ బుధవారం తెలిపారు. ఆర్డీవో ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని, సమస్య ఉన్నవారు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7.30 గంటల్లోపు ఫోన్ చేయాలని కోరారు.

పవర్ గ్రిడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

ఆలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పవర్ గ్రిడ్ ఏర్పాటుకు బుధవారం పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ మండలంలోని మనేకుర్తి, హులేబీడు, గ్రామాల్లో స్థలాన్ని పరిశీలించకారు. మొత్తం మూడు చోట్ల స్థలాలను గుర్తించామని ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ గోవింద్ సింగ్, ఆర్ఐ బసవన్న గౌడ్, వ్యవసాయ శాఖ ఏడీ సునీత, సర్వేయర్ అరుణజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

తుగ్గలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు మండలంలోని హుశేనాపురం చెందిన సీపీఐ నాయకుడు బొజ్జులను పరామర్శించారు. అనంతరం దిగువ చింతలకొండ వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందిన పత్తికొండ మండలం పందికోనకు చెందిన సురేంద్ర మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను పరామార్శించారు. కుటుంబానికి ప్రభుత్వం నుంచి బీమా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

చక్రాలలో ఎమ్మెల్యే పూజలు

పత్తికొండ: మండలంలోని చక్రాల గ్రామం సుంకులమ్మ ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే శ్యాంబాబు పూజలు చేశారు. గ్రామ నాయకులు ఎంపిటీసీ రాజు, తిమ్మరాజు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

ప్రమాదం అంచున బతుకుబాట


ఆలూరు-చిప్పగిరి ప్రధాన రహదారిలో ట్రాలీ ఆటోల్లో కూలీల ప్రయాణం

ఆదోని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఆదోని, ఆలూరు, హొళగుంద మండలంలోని గ్రామాల్లో కూలీలు నిత్యం వ్యవసాయ పనులకు వెళుతుంటారు. అయితే వీరు ప్రయాణించే తీరు ప్రమాదకరంగా ఉండటంతో ఆందోళన కనిపిస్తుంది. ఒక్కో ట్రాలీ ఆటోలో 30 మంది దాకా కూలీలు ప్రయాణిస్తున్నారు. వాహనం ఏమాత్రం అదుపు తప్పిన ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. కూలి కావాలంటే ఇలా వెళ్లక తప్పడం లేదని కూలీలు అంటున్నారు. పోలీసులు స్పందించి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునేవారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఉచిత కుట్టు శిక్షణ

ఆదోని టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ దేవన్న తెలిపారు. శంకర్ నగర్, శక్తి గుడి, 4వ వార్డులోని బసవన్న కట్టలో ప్రారంభిస్తామని, పాల్గొన్న మహిళలకు కుట్టు మిషన్‌ను ఉచితంగా ఇస్తామన్నారు. త్వరలో ఎమ్మెల్యే ద్వారా ప్రారంభించను న్నట్లు తెలిపారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ఆదోని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గురువారం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ వాల్మీకి శాంత బుధవారం తెలిపారు. వైసీపీ కౌన్సిలర్లు చైర్ పర్సన్ శాంతపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఈనెల 16వ తేదీన బలప్రదర్శన ఉన్న నేపథ్యంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది.

టిడ్కో గృహాలకు బస్సు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని టిడ్కో గృహాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడపనున్నట్లు డీఎం మహమ్మద్ రఫీ తెలిపారు. ఉదయం 8 గంటలకు కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి, టిడ్కో గృహాల మీదుగా చిన్న గోనెహాలు గ్రామానికి వెళ్తుందన్నారు

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

- చిరు వ్యాపారులతో ఎమ్మెల్యే సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని ఎమ్మెల్యే శ్యాంబాబు కోరారు. బుధవారం టీటీడీ కళ్యాణ మండపంలో చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. రహదారులు ఇరుగ్గా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. మార్కెట్ వద్ద ఇప్పటికే నిర్మించిన రైతుబజారు, గ్రామ పంచాయతీ స్థలాల్లో దుకాణల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామన్నారు. రెండు నెలలు వ్యాపారులు ఆ స్థలాల్లో దుకాణలు ఏర్పాటుచేసుకొని వ్యాపారాలు చేయాలని సూచించారు. కొందరు వ్యాపారులు మాట్లాడుతూ రైతు బజార్లో దుకాణలు ఏర్పాటు చేసుకుంటే వ్యాపారాలు జరగవని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే పైలెట్ ప్రాజెక్టు కింద రెండు నెలలు రైతుబజార్లో వ్యాపారం చేసుకోవాలని అలా వీలుకాని పక్షంలో తిరిగి రోడ్డుపైనే చేసుకోవచ్చని సూచించారు. సీఐ జయన్న, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్ కుమార్‌రెడ్డి, లోక్‌నాథ్, పంచాయతీ సెక్రటరీ నరసింహులు పాల్గొన్నారు.

శోభాయాత్ర శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్


మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 12న హనుమాన్ శోభా యాత్రను శాంతియుతంగా చేసుకోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య సూచించారు. బుధవారం పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లను నమ్మవద్దని, అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి , తహసీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో విజయలలిత, ఎస్సై దిలీప్ కుమార్, కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం


- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



తాగు నీటి సమస్యపై వీరభద్ర గౌడ్‌కు విన్నవిస్తున్న అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజు

ఆలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తమ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అరికెర గ్రామ సర్పంచ్ నాగరాజు విన్నవించారు. పోరంబోకు స్థలాలను దళితులకు కేటాయించాలని దళిత సంఘం నాయకులు మసాలా జగన్, ఉలిగప్ప, గోవింద్ విన్నవించారు. సమస్యలను సంబంధిత శాఖలకు పంపి పరిష్కారమేయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. వేదవతి, నగరడోన ప్రాజెక్టులు నిర్మించేందుకు నిధులు విడుదల చేయాలని జిల్లాకు వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడును కోరినట్లు తెలిపారు. పల్లె పండుగ నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ, గోకులం షెడ్లు నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అభివృద్ధికి అడుగులు వేస్తూ పాలనలో ముందుకు సాగుతుందన్నారు. కన్వీనర్ అశోక్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మెన్ రామ్‌నాథ్ యాదవ్, ఆర్టికల్ బాబు, సురేంద్ర, తిమ్మయ్య నరసప్ప, మల్లికార్జున రెడ్డి, సోమశేఖర్, రామాంజినేయులు, హనుమప్ప, మల్లేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి


మాట్లాడుతున్న ఏపీడీ లక్ష్మన్న

దేవనకొండ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉపాధి పనులు వేగవంతం చేయాలని ఏపీడీ లక్ష్మన్న, ఎంపీడీవో సూర్యనారాయణ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 20 ఫాంపండ్స్, నీటి తొట్లను నిర్మించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో 400 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేయాలన్నారు. ఏపీవో రాజునాయక్, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

హాలహర్వి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రత్యేకాధికారి రామాంజినేయులు సూచించారు. బుధవారం మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. జలాశయాల నుంచి గ్రామాలకు నీరందేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధి పనులు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. ఎంపీడీవో వరలక్ష్మి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరమణి, ఏపీవో చక్రవర్తి పాల్గొన్నారు.

12వ పీఆర్సీ ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని ఇవ్వాలని ఎస్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో కోరారు. 11వ పీఆర్సీ ముగిసి 20 నెలలు గడుస్తున్నా ఇంకా ప్రకటించకపోవడం ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తుందన్నారు. పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను చేపట్టాలన్నారు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

హాలహర్వి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చత్రగుడి సమీపంలో కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పింది. ఆదోని నుంచి బళ్లారికి వెళ్తున్న ప్రైవేటు బస్సు పొలాల్లోకి దూసుకెళ్లింది. అయితే ఎవరూ గాయపడలేదు.

సర్వేలు పూర్తి చేయాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో సర్వేలు సకాలంలో పూర్తిచేయాలని ప్రత్యేకాధికారి తులసీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపీడీవో సుహాసినమ్మతో కలిసి పాల్గొన్నారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోఆర్డీ రవికిశోర్, ఇంచార్జీ హౌసింగ్ ఏఈ బాలక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దహోతూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు. 11 మందిని అరెస్ట్ చేసి, రూ.20,060తో పాటు 9 సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిచామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పౌర సరఫరాల గోడౌన్ తనిఖీ


బియ్యాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పౌర సరఫరాల గోడౌన్‌ను బుధవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. రేషన్ నిల్వ, రికార్డులు, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసే ప్రక్రియలో పొరపాట్లు చోటుచేసుకోకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ రవీంద్ర రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ అకౌంట్స్ షకీలా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి పరిహారం


మంజూరు పత్రాన్ని ఇస్తున్న ఏపీడీ పక్కీరప్ప

ఆలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న కుటుం టబానికి ప్రభుత్వం రూ.5.15లక్షల పరిహారం మంజూరు చేసింది. బుధవారం డ్వామా ఏపీడీ పక్కీరప్ప, ఎంపీడీవో మహబూబ్ సాబ్, సర్పంచ్ నాగరాజు మంజూరు పత్రాన్ని మృతుడి భార్య నాగలక్ష్మికి అందించారు. ఏపీవో శ్రీనివాసులు, గ్రామ టీడీపీ నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

బాధితుడికి ఆపన్న హస్తం


ఆర్థిక సాయం చేస్తున్న సందీప్ రెడ్డి

ఆదోని టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి): అగ్ని ప్రమాదంలో నష్టపోయిన చిరు వ్యాపారిని కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా బుధవారం పరామర్శించారు. బాధితుడు నష్టపోయాడని భారత్ గ్యాస్ ఏజెన్సీ వారికి నాయకులు వివరించారు. స్పందించిన ఏజెన్సీ యజమాని సందీప్ రెడ్డి ఆర్థిక సాయం చేసి, గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి మారుతి, విద్యార్థి విభాగం నాయకుడు శ్రీనిత్ రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించండి


మాట్లాడుతున్న ఏపీడీ పద్మావతి

వెల్దుర్తి, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పనులు గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించాలని ఏపీడీ పద్మావతి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కాల్వలు, చెరువుల్లో పూడిక తీత, పంట కుంటల నిర్మాణం, నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం, గోకులం షెడ్లు తదతితర పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఏపీవో లక్ష్మన్న, ఈసీ రాజశేకర్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విన్సెంట్ ఫెర్రర్ సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న తండా వాసులు

తుగ్గలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విన్సెంట్ ఫెర్రర్ సేవలు మరువలేనివని సీఆర్‌పీ నాగేష్, అశోక్ అన్నారు. బుధవారం జొన్నగిరి, ఎల్లమ్మగుట్ట తండాలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ 103వ జయంతినా గిరిజనులు నిర్వహించారు. పేదవారి అభివృద్ధికి విన్సెంట్ ఫెర్రర్ ఉచిత విద్య, వైద్యం మౌలిక వసతులు కల్పించారన్నారు. ఆర్డీటీ లేకపోతే పేదలు దిక్కులేని వారవుతారన్నారు. తులసి నాయక్, శ్రీను నాయక్ తదితరులు ఉన్నారు.

ఇసుక మాఫియాను అడ్డుకుంటాం

ఆదోని టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇసుక మాఫియా అక్రమాలను అధికారుల సహకారంతో అడ్డుకుంటామని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి విజయ కృష్ణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సెంట్రల్ నగర అధ్యక్షుడు నాగార్జున అధ్యక్షతన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఇసుక మాఫియా నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్టు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. ఆరోపణలను చేసినవారు నిరూపించాలని సవాల్ చేశారు. తిరిగి దందా చేస్తే కేసులను నమోదు చేయిస్తామని హెచ్చరించారు. మరియాని చెన్నబసప్ప, ఉషరాజ్, మధుసూదన్ శర్మ, రమాకాంత్ పాల్గొన్నారు

వంట గ్యాస్ ధర తగ్గించాలి : సీపీఎం



పత్తికొండలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, నాయకుడు రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాలుగు స్థంభాల కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలతో పాటు వంటగ్యాస్, కరెంటు చార్జీలు పెంచడం ఏమిటని ప్రశ్నించారు. నాయకులు గంగన్న, కాశన్న, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, మాణిక్యం, రంగన్న, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీ నీటితో కుంటలు కళకళ

● గాజులదిన్నె ప్రాజెక్టుకు నీటి మళ్లింపు
● వేసవిలో దాహం తీర్చేందుకు ముందస్తు చర్యలు

గోనెగండ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఎల్లెల్సీ కింద సాగు, తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా గోనెగండ్ల మండలంలోని పలుగ్రామాలలో ఉన్న కుంటలు, చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను ఎల్లెల్సీ నీటితో ఇరిగేషన్ అధికారులు నింపుతున్నారు. మండలంలోని పలు కుంటలు, చెరువులు ఎల్లెల్సీ నీటితో కళకళలాడుతున్నాయి. గోనెగండ్ల, అలువాల సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను, కులుమాల, పెద్దనేల


ఎల్లెల్సీ నీటిని ఎస్కేప్ చానల్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టుకు మళ్లించిన దృశ్యం

టూరు, తువ్వకుంట, తదితర కుంటలు ఎల్లెల్సీ నీటితో నింపివేశారు. తుంగభద్రడ్యామ్ నుంచి ఆంధ్రకు ఏప్రిల్ 15 వరకు నీటి విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. మొదట్లో మార్చి చివరి వరకు అని ప్రకటించారు. అయితే రైతులు సాగు చేసుకున్న పంటలు పూర్తిగా చేతికి అందాలంటే మరో 15 రోజులు అదనంగా విడుదల చేయాలని రైతులు, నాయకులు కోరడంతో ఇరిగేషన్ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఏప్రిల్ 2వ తేదీ నుంచి విడుదల అయ్యే నీరు పంట పొలాలకు కొంతమేరకు తగ్గించి ఆంధ్రబార్డర్ హోళగుంద, ఆదోని, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు సెక్షన్‌లలో ఉన్న నీటి కుంటలు, వాగులు, వంకలు, చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంక్‌లను నీటితో నింపేందుకు చర్యలు తీసుకున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యామ్ నుంచి ప్రస్తుతం గోనెగండ్ల సెక్షన్‌కు మంగళ, బుధవారం 142 క్యూసెక్కుల నీరు చేరింది. విడుదల అయిన నీటిని గోనెగండ్ల పొలాలకు 12 క్యూసెక్కులను, కోడుమూరు కు 75 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఏదీ ఏమైనా ఏప్రిల్ నెల 15 వరకు నీటి విడుదల పెంచడంతో వే సవిలో గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలు ఉంటుంది. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టుకు ఎల్లెల్సీ నీరు మళ్లింపు

గాజులదిన్నె ప్రాజెక్టుకు గత రెండు రోజులుగా తుంగభద్ర దిగువ


నిండుకుండలా అలువాల ఎస్ఎస్ ట్యాంక్

కాలువ నీటిని గోనెగండ్ల ఎస్కేప్ చానల్ ద్వారా రోజుకు 55 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు మళ్లిస్తున్నారు. ఎల్లెల్సీ కాలువ నీరు విడుదల అయినన్ని రోజులు నీటిని గాజులదిన్నె ప్రాజెక్టు మళ్లించనున్నట్లు తెలుస్తుంది. ప్రాజెక్టులో ప్రస్తుతం నీరు 1.2 టీఎంసీ ల నీరు మాత్రమే ఉంది. ఈ నీటితో తాగునీటి పథకాలకు, ఆయకట్టు రైతులకు నీరు విడుదల చేయాల్సి ఉంది. జూన్, జూలై నెలలోవర్షాలు కురిసే వరకు ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీటితోనే కొనసాగించాల్సి వస్తుంది. ఎండ వేడిమి కారణంగా రోజుకు 30 నుంచి 40 క్యూసెక్కుల నీరు ఆవిరి(వృథా) అవుతుంది. ప్రతిరోజూ బండగట్టు, డోన్, క్రిష్ణగిరి తాగు నీటి పథకాలకునీటి అందిస్తున్నారు. ఈ నెల 15 వరకు 13000 ఎకరాలలో సాగు చేసిన ఆయకట్టు భూములకు ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదల చేయనున్నారు. అలాగే వేసవిలో అవసరమైన సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్ ప్రాంతాలకు కూడా తాగునీటి విడదల చేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టులో ఉన్న 1.2 టీఎంసీల నీరు ఈ వేసవిలో సరిపడతాయో లేదో అంతుచిక్కడం లేదు.

పెంచిన ధరలు తగ్గించాలి: సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సోమప్ప సర్కిల్‌లో సీపీఎం అధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు, రాముడు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ముడిచమురు ధర భారీగా తగ్గిన కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ. 50 పెంచడం అన్యాయమని విమర్శించారు. పెంచిన ధరలు తగ్గించకపోతే సీపీఎం అధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలప్ప, సురేష్, నరసయ్య, బజారి, సుభాన్, తిమ్మయ్య పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయండి: యూటీఎఫ్


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నూతన భవనంలో ఈ నెల 13న ఏర్పాటు చేసిన విద్యాచైతన్య సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు దావీదు, ఎల్లప్ప పిలుపునిచ్చారు. బుధవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలులోని సోమిశెట్టినగర్‌లో నిర్మించిన నూతన భవనం ఈ నెల 13న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యాచైతన్య సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన జీవో 117,128 వల్ల విద్యా వ్యవస్థను కాపాడడానికి, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు సాధనకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యారం గం సవాళ్లు- కర్తవ్యాలు అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు యస్ వెంకటేశ్వర్లు, పీఆర్సీ బకాయిలు సాధన-కర్తవ్యాలుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ ఉపన్యసిస్తారని తెలిపారు. సమావేశంలో రాజు, రామాంజనే యులు, నరసింహులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డొదు: సీఐ

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ మోసపోవద్దని మంత్రాలయం సీఐ రామాంజులు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని కల్లుదేవకుంట గ్రామంలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్థులతో మాట్లాడారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, భూసరిహద్దుల గొడవలు, కర్ణాటక మద్యం, నాటుసారా వంటి అంశాలపై గ్రామస్థులతో మాట్లాడారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, కర్ణాటక మద్యం అమ్మినా, రవాణా చేసినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. క్రికెట్ బెట్టింగులకు పాల్పడిన వాటిపై నిఘా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

మంత్రాలయం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన మంత్రాలయం మండలంలోని చెట్నహళ్లి గ్రామం వద్ద బుధవారం చోటు చేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మిగనూరు చెందిన ఆటో మంత్రాలయం వస్తుండగా.. తుపాన్ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని మంత్రాలయం పోలీసులు తెలిపారు.

రాఘవేంద్రుడిని దర్శించుకున్న ఫుడ్ కమిషన్ చైర్మన్


పీఠాధిపతితో మాట్లాడుతున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామిని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి మంత్రాలయంలో బసచేసిన విషయం తెలసిందే. బుధవారం ఉదయం మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు శ్రీపతిఆచార్, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహామూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని, రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తహసీల్దారు ఎస్ రవి, అనంతపురాణిక్, భీమన్నగౌడు, మహేష్, అనంతస్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే ఎన్ఎస్‌యూఐ లక్ష్యం


జెండాను ఆవిష్కరిస్తున్న ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే ఎన్ఎస్‌యూఐ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ అన్నారు. బుధవారం ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాలలో ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరేష్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తున్న సంఘం ఎన్ఎస్‌యూఐ అన్నారు. ప్రతి విద్యార్థి చదువుతూ.. పోరాడాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్, సతీష్, రాజశేఖర్, కార్తిక్, హనుమంతు, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు కృషి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. బుధవారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోనే చాలా మంది అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీలను తీసుకుంటూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజలకు ప్రతీరోజు అందుబాటులో తమ కుటుంబ సభ్యులు ఉంటారని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, నాగిరెడ్డి, గోపాల్, రామకృష్ణ, శివ, లక్ష్మన్న, రామయ్య, పోలీవీరేష్, బొజ్జప్ప, కేశన్న, మాణిక్యరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

కోసిగి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలని దళిత సంఘాల నాయకులు, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం కోసిగి మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలును దళిత సంఘాల నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కర్రెప్ప, ప్రధాన కార్యదర్శి శామేల్, కోశాధికారి శ్రీరాములు మాట్లాడుతూ ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. మండల కేంద్రంలో దళితులందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు రామన్న, ఈరన్న, లోకేశ్, నరసయ్య, సోల్మాన్‌రాజు, దుర్గప్ప, దేవన్న, రాము పాల్గొన్నారు.

తాగునీటికి సమస్య తలెత్తకుండా చర్యలు

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో రాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య వస్తే కింది అధికారుల నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. పద్మ ఇంజనీరింగ్ అసిస్టెంట్. నెంబరు.9154537205, భీమేష్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ 7731011516, టి.వెంకట్రాముడు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ 9100122521లను ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

భూ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు


నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): భూ పోరాట యోధుడు చండ్ర రాజేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా చండ్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో ముఖ్యపాత్ర పోషించిన మహనీయుడన్నారు. రైతు, కార్మిక హక్కుల పోరాటల కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, పంపన్నగౌడు, భాస్కర్‌యాదవ్, దాదావలి, కేసీ జబ్బార్, ఖాజా, వీరేష్, తిమ్మగురుడు, విజయేంద్ర, రాజీవ్, ఇస్మాయిల్‌లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి గ్రామానికి చెందిన కురువ వెంకోబ కుమారుడు కురువ లాలప్ప జాతీయ స్థాయి డాడ్జీబాల్ పోటీలకు ఎంపికైనట్లు డాడ్జిబాల్ సెలక్షన్ ప్రెసిడెంట్ డాక్టర్ టీపీ కంబిరెడ్డి, సెక్రటరి డాక్టర్ సబీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదోనిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మార్చి 16న నిర్వహించిన డాడ్జీ బాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో ఈనెల 25 నుంచి 27 వరకు కర్ణాటకలోని ఉడిపిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం దక్కిందన్నారు. విద్యార్థి లాలప్పను గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

వైభవంగా ప్రహ్లాదరాయల రథోత్సవం

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. బుధవారం చైత్రమాసం ద్వాదశి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో చెక్క రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజల మంటపంలో ఊంజలసేవ నిర్వహించారు. అంతకముందు స్వామివారికి పూర్ణబోధ పూజమందిరంలో పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించి హారతులు ఇచ్చారు. పీఠాధిపతి భక్తులకు ఆశీర్వాదించారు.


చెక్క రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

ఆధార్ ఉంటేనే పౌష్టికాహారం?

● సొంత నిబంధనలు పెట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు!

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తుంది. అయితే అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు ఉన్నతాధికారుల నిబంధనలు ఉన్నాయంటూ బాలింతలకు అందజేయాల్సిన పౌష్టికాహారాన్ని అందజేయడం లేదు. దీంతో బాలింతలకు అందాల్సిన పౌష్టికాహారం అందడం లేదు. ఎమ్మిగనూరు మండలంలో బుధవారం సిరాలదొడ్డి గ్రామంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్త బాలింతకు అందజేయాల్సిన పౌష్టికాహారాన్ని అందజేయలేదు. ఎందుకని ప్రశ్నించడంతో ఉన్నతాధికారులు పుట్టిన చిన్నారికి తప్పకుండా ఆధార్ కార్డు ఉంటేనే పౌష్టికాహారాన్ని అందజేయాలని నిబంధనలు పెట్టారని అందుకే అందజేయకుండా తిరిగి పంపామని సమాధానం చెప్పారు. బాలింతలకు ప్రతినెల మూడు కేజీల బియ్యం, కేజీ బ్యాళ్లు, అరలీటరు మంచినూనె, రాగిపిండి రెండు కేజీలు, అటుకులు ఒక కేజీ, బెల్లం 250గ్రాములు, చిక్కి 250గ్రాములు, ఎండు ఖర్జూర 250 గ్రాములు, గుడ్లు 25, పాలు ఐదు లీటర్లు అందజేయాల్సి ఉంది. వాస్తవానికి మండలంలో దాదాపు ఎక్కడా కూడా ఈ నిబంధనలను అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు పాటించడం లేదని మండలంలోని ప్రజలు, మహిళలు, బాలింతలు తెలపడం గమనార్హం. ఈ విషయంపై ఎమ్మిగనూరు సీడీపీవో సఫరున్నిసా బేగంను వివరణ కోరగా వాస్తవానికి పౌష్టికాహారాన్ని అందజేసేందుకు పుట్టిన బిడ్డ ఆధార్ కార్డు అవసరంలేదన్నారు. నేను బిజీగా ఉన్నానని..మీతో సూపర్‌వైజర్ మాట్లాడతారని చెప్పారు. సూపర్ వైజర్ సురేఖ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని అందజేసే విషయంలో పుట్టిన బిడ్డ ఆధార్ దాదాపుగా ఆరు నెలల వరకు అవసరం లేదని, అన్ని సరుకులను అందజే స్తామన్నారు. ఉన్నతాధికారులు ఆధార్ నమోదు చేయాలని చెప్పారని తెలిపారు.

ప్రతి విద్యార్థికి కిట్ అందజేస్తాం


తరగతి గదులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు మాధురి

గోనెగండ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభమయిన వెంటనే ప్రతి విద్యార్థికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్‌లను అందజేస్తామని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకురాలు మాధురి అన్నారు. బుధవారం ఆమె గోనెగండ్లలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గదులను పరిశీలించారు. కిట్‌లను ఎక్కడ నిలువ చేస్తే భద్రంగా ఉంటాయో రూములను స్థానిక విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గోనెగండ్ల మండలంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కమ్యూ నిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ తోట శివశంకర్, ఎంఈవోలు నీలంత, రామాంజినేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్‌బండలో దేవర


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

గోనెగండ్ల, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఐరన్ బండ గ్రామంలో సుంకులాపరమేశ్వరి, మారెంబామ్మ దేవర మహోత్సవాన్ని బుధవారం భక్తులు, గ్రామపెద్దలు భక్తిశ్రద్ధలతో వైభవంగా చేపట్టారు. వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలను సమర్పించారు. దేవరలో ఐరన్ బండ, ఎన్నెకండ్ల గ్రామస్థులే కాక కర్నూలు, బళ్లారి, మహబూబ్‌నగర్, ఆదోని ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం భజన కార్యక్రమం చేపట్టారు. దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

14న రక్తదాన శిబిరం

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈనెల 14న రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కదిరికోట అదెన్న అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో తలసేమియా బాధితుల కోసం తమ వంతుగా రక్తదాన శిబిరం చేశామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంబేడ్కర్‌పై వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు ఇస్తామన్నారు. సమావేశంలో ఉసేని, ఆనంద్, చైతన్య హనుమంతు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు


ఫెర్రర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆర్డీటీ సిబ్బంది

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుపేదల అభ్యున్నతి కోసమే ఆర్డీటీ సేవలు అందిస్తుందని ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం, వగరూరు వి. తిమ్మాపురం, రాంపురం, సూగూరు గ్రామాల్లో సీఈవో నరసింహులు ఆధ్వర్యంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి గ్రామ వీధు ఊరేగించారు. అనంతరం కేకు కట్‌చేసి, అనాథలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ లీడర్లు లాజరు, సంసోను, మత్తయ్య, మునెప్ప, సుధాకర్, ఆదాము, ఏసేపు, దానియేలు, ఈరన్న, భూపతి, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఆర్వో ప్లాంట్



సూగూరు పాఠశాలలో రిపేరిలో ఉన్న ఆర్వో ప్లాంటు

మంత్రాలయం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంటు పని చేయడం లేదు. దీంతో విద్యార్థులు శుద్ధజలం కోసం నాలుగేళ్లగా నిరీక్షిస్తున్నారు. పాఠశాల గదుల కొరత ఉన్నప్పటికీ గదిలో ఆర్వో ప్లాంటు నిర్మించారు. కొన్ని నెలల పాటు పని చేసింది. మరమ్మతులకు వచ్చింది. ఎన్నిసార్లు కంపెనీ వారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు శుద్ధజలం అందడం లేదు. పాఠశాలలో తాగడానికి నీరు లేకపోవడంతో ఇంటి వద్ద నుంచే బాటిల్స్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి ఆర్వో ప్లాంటును మరమ్మతు చేయించి విద్యార్థుల దాహార్తిని తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బాలిక అదృశ్యం

మంత్రాలయం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యం అయినట్లు మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధ వారం ఉదయం బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదన్నా రు. కూతురు కోసం బంధువులు, పరిచయస్తుల వద్ద గాలింపు వెతికారు. కూతురు ఆచూకీ లభ్యం కాకపోవటంతో తండ్రి మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలిక అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.